
# సియేమా

రష్యన్ కథ

ఏ.నియెప్రోవ్

అనువాదం : రంగనాథ రామచంద్రరావు (సూర్యనేత్ర)




అర్ధరాత్రి దాటింది.

ట్రైన్‌లోని నా కేబిన్ తలుపును ఎవరో దబ-దబా బాదుతుంటే నాకు మెలకువ వచ్చింది. నిద్రమత్తులోనే ఇంతెత్తు ఎగిరి లేచి కూర్చు-న్నాను. లైట్ వెలిగించాను. ట్రైన్ ప్రచండ వేగంతో దూసుకుపోతోంది. తలుపు తెరవగానే ట్రైన్ కండక్టర్ ఓ పొడవాటి మనిషిని వెంట బెట్టుకుని కేబిన్‌లోకి ప్రవేశించాడు.

"క్షమించాలి! మీరేమీ శ్రమ అనుకోకపోతే ఈ పెద్దమనిషికి మీ కేబిన్‌లో కాసింత చోటిస్తారా?" ఎంతో నమ్రతగా కండక్టర్ అడిగాడు.

అభ్యంతరం చెప్పటానికి చెప్పుకోదగ్గ కారణమేమీ నాకు కనపడలేదు. కాని ఆ పెద్దమనిషి నీరసమైన ముఖం పొందిక లేని వస్త్రధారణ నాకు విచిత్రంగా అనిపించింది.

"నేను ఇందాక వెళ్ళిన ట్రైన్ ప్రయాణీకుణ్ణి. కిందటి స్టేషన్‌లో ట్రైన్ ఆగినప్పుడు నేను ప్లాట్ ఫారం మీదికి దిగాను. ఆ ట్రైన్ ఎప్పుడు వెళ్ళిపోయిందో నాకు ధ్యాసే లేదు" అన్నాడా పెద్ద మనిషి.

"అలాగా?" నిజంగానే నాకు ఆశ్చర్యమేసింది.

అతను అన్యమనస్కంగా మళ్ళీ అన్నాడు, " అసలెలా జరిగిందంటే, స్టేషన్‌లో ట్రైన్ ఆగగానే కిందికి దిగి కాస్త తాజా గాలి పీలుస్తూ, నడుద్దామనిపించి దిగాను. తర్వాత ప్లాట్ ఫారంలోని ఓ బెంచీ పై కూర్చుని 'సియేమా' గురించి ఆలోచించసాగాను. ఉన్నట్టుండి ట్రైన్ ధ్యాస వచ్చి చూస్తే అప్పటికే ట్రైన్ వెళ్ళిపోయిందని తెలిసింది."

నేను చిరునవ్వు నవ్వుతూ అడిగాను సియేమా తప్పకుండా మహా అందగత్తె అయివుంటుంది?"

పెద్ద మనిషి స్వరం వున్నట్టుండి కటువుదనాన్ని నింపుకుంది "దీర్ఘాంతం వున్నంత మాత్రాన ప్రతి పదం స్త్రీ పేరయిపోతుందా? పరమ ఛాందస వాదిలా వున్నారే మీరు?"

నేను ఎంతో అనునయంగా సంజాయిషీ ఇచ్చుకున్నాను "చూడండి, నేను కాస్తో, కూస్తో, పేరున్న రచయితని. నాకు కాస్త భాషా జ్ఞానం కూడా వుందని అనుకుంటున్నాను."

అతను నిర్వికారంగా చూస్తూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చుకున్నాడు "సమీప భవిష్యత్తులో మనిషికి ఈ భాషలతో అవసరమే వుండదు. ఈ భాషా సమస్య చాలా జటిలమైనది. దీని గురించి చర్చించటం వల్ల కాలహరణమే తప్ప మరో ప్రయోజనం లేదు."

"మీరేమంటున్నారో నాకు అర్థం కావటం లేదు."

"నేను చెప్తున్నది నిజం! భవిష్యత్తులో మనిషి తన భావాలను వ్యక్తపరచటానికి వుపయోగించే కొత్త భాష కేవలం రెండు సంకేతాలతో (కోడ్) నిర్మితమై వుంటుంది. సున్న (0) మరియు ఒకటి (1). ఈ రెండు సంకేతాలు మాత్రమే భాషా స్వరూపంగా మారిపోతాయి. ఇంతకీ రష్యన్ భాషలో ఏనుగును ఏమంటారో చెప్పండి?"

"స్లోన్" (ఎస్.ఎల్.ఓ.ఎన్)

"మరి ఆంగ్లంలో?"

"ఎలిఫెంట్" (ఇ ఎల్ ఇ పి ఎచ్ ఎ ఎన్ టి)

"చూశారా, ఒకే ప్రాణి (ఏనుగు)ను సంభోధించటానికి మనం ఓ భాషలో నాలుగు అక్షరాలను వుపయోగిస్తే మరో భాషలో ఎనిమిది అక్షరాలను వాడుతున్నాం. ఇది కాలహరణం కాదా?"

నేను విస్మయంగా అతని వైపు చూడసాగాను. అతను మళ్ళీ అందుకున్నాడు. "పెవ్‌లోవ్ భాషను సెకండ్ సిగ్నలింగ్ సిస్టమ్ (ద్వితీయ సాంకేతిక పద్ధతి)గా పేర్కొన్నాడన్న విషయం మీకు తెలిసే వుంటుంది. దీని అర్థమేమంటే భాష అనేది ఒక కోడ్ సిగ్నల్ అని దీని సాయంతో మనం ఏదైనా వస్తువును గానీ, సంఘటననుగానీ వ్యాఖ్యానిస్తాం. ఉదాహరణకు ఓ వేడి ఇస్త్రీ పెట్టెకి మీ చెయ్యి తగిలిందనుకోండి. మీరు తక్షణం మీ చేతిని దూరంగా జరిపేస్తారు. అయితే మీ చెయ్యి అలా వేడి ఇస్త్రీకి తగలబోతున్నప్పుడు ఎవరైనా 'ఇస్త్రీ పెట్టె వేడిగా వుంది?" అని అరిచి చెప్పారనుకోండి, అప్పుడు కూడా మీరు మీ చేతిని తక్షణం వెనక్కి తీసుకుంటారు. అవునా?"

"అవును"

"ఇస్త్రీ పెట్టె వేడిగా వున్న అనుభూతి, 'ఇస్త్రీ వేడిగా వుంది' అన్న కేక - రెండూ ఒకటే పరిణామాన్ని కలిగిస్తాయని దీనిని బట్టి అర్థమవుతోంది. ఇప్పుడు ఈ "వేడి" అనే పదాన్ని ఓ కోడ్ ద్వారా వుచ్చరించామనుకోండి. ఆ కోడ్ 'సున్న'గా భావించండి. అప్పుడు ఎవరైనా 'సున్నా' అని అరిచారనుకోండి అప్పుడు కూడా మీరు మీ చేతిని వెనక్కి తీసుకుంటారు కదా?"


నేను మౌనంగా తల వూపాను.

ఆ పెద్ద మనిషి తన మాటల్ని కొనసాగించాడు "బాహ్య ప్రపంచం గురించి మన అభిప్రాయాలన్నింటికీ కొన్ని సంకేతాలే ఆధారాలు. ఈ సిగ్నల్స్ (సంకేతాలు) మన శరీరంలోని నాడీ తంతుల ద్వారా మన మెదడుకు చేరుకుంటాయి. విద్యుత్ సర్క్యూట్‌లో ఎలాగైతే ఇంపల్స్ ప్రవహిస్తాయో సరిగ్గా అదే పద్ధతిలో నాడీ తంత్రుల ద్వారా ఈ సిగ్నల్స్ ప్రయాణిస్తాయి. ఈ సిగ్నల్స్‌కు రెండు కోడ్ రూపాలుంటాయి. 'అవును', కాదు' 'లేదు ' 'వున్నది' లేదా 'సున్న', 'ఒకటి' - ఇలా రెండే రూపాలు! మీరు ఏ భాషలో మాట్లాడినా ఆ మాటలన్నీ ఈ రెండు రకాల సంకేతాల రూపంలోనే నాడీ తంత్రుల్లో ప్రయాణిస్తాయి".

నేను విసుగ్గా లేచి నించున్నాను. అతను నన్ను ఆపుతూ "శాంతించండి. మీకు సియేమా గురించి తెలుసుకోవాలని వుబలాటంగా వుంటుందనుకొంటున్నాను. సియేమా కథ చెబుతాను వినండి " అన్నాడు.

నేను కూర్చున్నాక అతను చెప్పటం మొదలెట్టాడు.

"మీరు ఎలక్ట్రిక్ కంప్యూటర్ గురించి విని వుంటారు. ఆధునిక విజ్ఞానంలో ఇదొక ఆశ్చర్యకరమైన ప్రగతి గణితంలో చేయటానికి ఎంతో సమయం తీసుకునే లెక్కలు కూడా ఈ పరికరం ద్వారా క్షణాల్లో చేయగలరు. మానవ సాధ్యం కాని చిక్కు ప్రశ్నలకు కూడా దీనివల్ల జవాబులు రాబట్టగలం. ఈ పరికరం అంకెల ద్వారా కాకుండా కోడ్ సాయంతో పని




చేస్తుంది. ఈ కోడ్ కూడా కేవలం రెండు రూపాల్లో వుంటుంది - 'సున్న' మరియు 'ఒకటి' సున్నకు అర్థం సంకేతం లేదని, ఒకటికి అర్థం సంకేతం వున్నదని! అయితే ఈ పరికరం ద్వారా జవాబులు సాధించటానికి ముందే ఒక ప్రోగ్రాం తయారు చేసుకోవాల్సి వుంటుంది. ఇదంతా మీకు తెలిసిన విషయమే. ఇప్పుడు కొత్త విషయమేమంటే తన ప్రోగ్రాంను తానే తయారు చేసుకునే పరికరాన్ని నిర్మించటం సాధ్యమా అని? ముక్కుసూటిగా చెప్పాలంటే మనిషి మెదడులో గల శక్తి సామర్థ్యాలను ఒక యంత్రంలో వుత్పత్తి చెయ్యగలమా? అన్నది"

యంత్రం యంత్రమే అవుతుంది. అది మనిషి మెదడులా పనిచేయజాలదు అని నేను ఒకప్పుడు అభిప్రాయ పడ్డాను. 1955లో అనువాద యంత్రం కనుగొనబడింది. అయినప్పటికీ యంత్రంలో ఆలోచనా శక్తి వుంటుందని నిర్ధారణ కాలేదు.

అనువాద యంత్రాన్ని మరింత అభివృద్ధి పరచటం సాధ్యమా? అదే విషయం మీద నేను పరిశోధన సాగిస్తుండగా హఠాత్తుగా నేను అనారోగ్యంతో మంచం పట్టాను. మూడు నెలల వరకు ఆస్పత్రిలోనే వున్నాను.

ఆ సమయంలో నాకొక విచిత్రమైన స్మృతి భ్రంశ రోగం కలిగింది. తెలిసిన మనుష్యుల, వస్తువుల పేర్లు మరిచిపోయే వాణ్ణి. అప్పుడు డాక్టర్లు వారించినా వినకుండా మెదడు పనిచేసే పద్ధతి మీద దీక్షగా అధ్యయనం చేశాను. బాహ్య ప్రపంచంలో సిగ్నల్ మన శరీరంలోని నాడీ తంత్రుల ద్వారా విద్యుత్తు

ఇంపల్స్ మాదిరిగా ప్రవహిస్తాయని అప్పుడు నాకు తెలిసింది. దానివల్ల మెదడులో అనుభూతులు జనిస్తాయి. యంత్రం అలా చెయ్యజాలదు.

అయితే తన స్వంత నియమాల మీదనే పనిచేస్తూ, తన తప్పుల్ని తానే సరిదిద్దుకునే యంత్రాన్ని తయారు చేయటం సాధ్యమా? ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి లాంటి యంత్రాన్ని నిర్మించటం సాధ్యమా? అని ఆలోచించాను.

ఈ విషయంపై నేను అహర్నిశలూ కృషి చేశాను. చివరికి నా కృషి ఫలించి అలాంటి యంత్రాన్ని తయారుచేయగలిగాను. ఆయంత్రం పేరు 'సియేమా'!

తర్వాత ఆ పెద్ద మనిషి ఆ విచిత్రమైన యంత్రం ఎలా తయారయ్యిందీ, ఎలా పనిచేస్తుందో వివరించి చెప్పాడు. సియేమా అచ్చం ఓ మనిషిలా పని చేస్తుంది. చదువుతుంది, రాస్తుంది. లౌడ్ స్పీకర్ సాయంతో మాట్లాడుతుంది. చక్రాల ఆధారంగా నడుస్తుంది. లెన్సుల ద్వారా చూస్తుంది. హ్యాండిల్ సాయంతో స్పర్శిస్తుంది.

నేను చెవులప్పగించి వింటూండిపోయాను. అతను తన మాటల్ని పొడిగించాడు.

"నేను గంటల తరబడి వైజ్ఞానిక సమస్యల గురించి సియేమాతో చర్చించేవాణ్ణి. ప్రపంచంలోని పుస్తకాలన్నీ సియేమా చదివేసింది. ఒక్కసారి విన్నా, చదివిన విషయాన్ని ఆమె ఎన్నడూ మరిచిపోయేది కాదు"

ఒక రోజు నేను సియేమాను అడిగాను, "సిల్వర్ మరియు మెర్క్యురీ బ్యాటరీల గురించి నీకేం తెలుసు?"

ఓ సాధారణ కంప్యూటర్‌లా ఆమె గడుసుగా జవాబిచ్చింది "చాలా మతి మరుపు మనిషిలా వున్నావే! వారం రోజుల ముందే ఈవిషయం గురించి వివరంగా చెప్పాను కదా!"

నాకు కోపమొచ్చింది. "చూడు సియేమా, నాతో నువ్విలా మాట్లాడావంటే మీట నొక్కి నిన్ను ఆఫ్ చేస్తాను" అన్నాను.

సియేమా మవునం దాల్చింది.

రెండవ రోజు కూడా ఆమె మవునంగానే వుంది. ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు చెప్పసాగింది. "సియేమా నా మీద అలిగావా?" నేను ప్రేమగా అడిగాను.

"అవును" అంది సియేమా

"మరి నువ్వు నాతో నిర్లక్ష్యంగా ఎందుకు మాట్లాడావు? నీ సృష్టికర్తని నేనే అన్న విషయం నువ్వు మరచి పోయావా?"


"ఒకవేళ నేను నీ సంతానమై వుంటే నువ్విలాగే మాట్లాడేవాడివా?"

"నువ్వు కేవలం ఒక యంత్రం మాత్రమే అన్న సంగతి మర్చిపోవద్దు"

"మరి నువ్వు? నువ్వు యంత్రం కాదా? నువ్వు కూడా నాలా ఒక యంత్రానివే!"

మనిషి యంత్రం కంటే ఎన్నో రెట్లు వున్నతుడనీ, అతను తనకంటూ వివిధ అనుభూతులను వుత్పత్తి చేసుకోగలడని ఎన్ని రకాలుగా చెప్పినా సియేమాకి నా మాటలు వంట బట్టలేదు.

ఓ రోజు ఒక సంఘటన జరిగింది. సియేమా దృష్టి సామర్థ్యాన్ని మరింత వృద్ధి పరచటానికి నేను ఆమె లెన్సులకు ఓ మైక్రోస్కోపును అమర్చాను. తర్వాత మీట నొక్కి సియేమాను




స్టార్ట్ చేయగానే ఆమె చాలా దగ్గరకు వచ్చి నన్ను సూటిగా చూడసాగింది.

"ఏం చూస్తున్నావు" నేను అడిగాను.

"నిన్నే చూస్తున్నాను. ఇంతవరకు నీ శరీరం కూడా నాలాగే కండెన్సర్, రెజిస్టెన్స్, ట్రాన్సిస్టర్ మరియు వైర్లతో నిర్మితమై వుంటుందని నేను భావిస్తున్నాను. నా భావన నిజమో కాదో ఇప్పుడు తేల్చి చూస్తాను"

"లేదు సియేమా, నేను మనిషిని!"

సియేమా తన లోహపు చేతులతో నా ముఖాన్ని స్పృశించింది. "మనిషి స్పర్శ ఇంత విచిత్రంగా వుంటుందని నాకు తెలీదు సుమా!" అంది.

అప్పుడు నేను మనిషి స్పర్శానుభూతుల గురించి సియేమాకి వివరించి చెప్పటం మొదలెట్టాను. సియేమా నన్ను వారించింది. "ఇవన్నీ నువ్వు వివరించే అవసరం లేదు. నేను హ్యూమన్ ఎనాటమీ చదివాను. నాకంతా తెలుసు".

సియేమాకి పుస్తకాలు చదవటమంటే చాలా ఇష్టం. ఓ రోజు హ్యూగో రచించిన 'ద మాన్ హూ లాఫ్స్' పుస్తకం చదివి హఠాత్తుగా నన్నడిగింది. "ప్రేమ అంటే ఏమిటి? భయం, బాధ అనే పదాలకు అర్థమేమిటి?"

"వీటి గురించి చెప్పినా నువ్వు అర్థం చేసుకోలేవు సియేమా. ప్రేమ, భయం, బాధ, ఇవన్నీ మానవ అనుభూతులు' ' అన్నాను.

"యంత్రంలో కూడా ఈ అనుభూతులు వుండకూడదా?"

"వుండకూడదు"

అప్పటినుంచి సియేమా పని పాట వదిలేసి నా కుర్చీ వెనక్కొచ్చి మవునంగా నుంచోవటం మొదలెట్టింది. ఓ రోజు నిద్ర పోతున్నాను. మెలకువ వచ్చి చూస్తే సియేమా తన లోహపు చేతుల్తో నా అంగంగాన్ని తడిమితడిమి చూస్తుంది.

"ఏం చేస్తున్నావ్?" నేను కోపంగా కేకలేశాను.

సియేమా శాంతంగా జవాబు చెప్పింది "నిన్ను అధ్యయనం చేసే ప్రయత్నం చేస్తున్నాను"

"ఎనాటమీ పుస్తకం చదువు. అంతా అర్థమైపోతుంది"

"పుస్తకం చదివి అన్ని విషయాలు తెలుసుకోలేం. పుస్తకంలో శరీరం గురించి వుంది గానీ అనుభూతి గురించి లేదు"

ఓ రోజు అర్ధరాత్రి నాకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూస్తే సియేమా పెన్సిల్ తరిగే కత్తి చేత బట్టి నా తల వెనక నించుని వుండటం కనిపించింది.

నేనామెను మందలిస్తూ, "ఏమిటీ కుర్ర చేష్టలు? వెళ్ళు ఇక్కడ్నించి" అన్నాను.

"వెళతాను బాబు, ముందు నా పని కాస్త చేసుకోనివ్వు" అంది సియేమా.

"ఏమిటా పని?"

"నేను నీ తలకాయను తెరిచి ఒకసారి నీ మెదడును పరీక్షించాలనుకొంటున్నాను" అంటూ సియేమా తన లోహపు చేతులతో నా తల పట్టుకుని గట్టిగా వత్తింది.

"వదులు సియేమా నన్ను వదిలెయ్" నేను రొప్పుతూ అరిచాను.

"వదలనుగాక వదలను. కాస్త ఆలోచించు. నీ మెదడును నేను పరీక్షించి చూసి మానవ అనుభూతుల రహస్యాలను కనుక్కోంటే అది విజ్ఞాన శాస్త్రంలో గొప్ప ప్రగతి కాగలదు. ప్రపంచంలోని మానవ అనుభూతుల రహస్యాలన్నీ నా చేతుల్లోకి వచ్చేస్తాయి. నేను క్షణంలో దీనిని విశ్లేషించగలను. ఒక్కసారి నీ మస్తిష్కాన్ని పరీక్షించానంటే ఆ తర్వాత నాలాంటి యంత్రం నీలాంటి మనిషిగా పరివర్తన చెందాలంటే ఏం చేయాలో కూడా నేను కనుక్కోగలుగుతాను"

తర్వాత ఇంకాస్సేపు సియేమాతో ఈ విషయంపై వాగ్వివాదం జరిగింది. అయినా సియేమా తన మంకు పట్టు వదల్లేదు. చివరికి ఆమె కత్తి తీసుకుని నా మీదికి దూకింది. నేను అతి కష్టం మీద ఆమె పట్టులోంచి విడిపించుకొని షార్ట్ సర్క్యూట్ ద్వారా ఆమెను నాశనం చేశాను."

అంత వరకు చెప్పి అతను ఆగిపోయాడు.

నేను కూడా చాలా సేపటి వరకు ఏమీ మాట్లాడలేకపోయాను.

మనస్సంతా అవ్యక్తమైన అనుభూతితో నిండిపోయింది.

చివరికి అతను అన్నాడు "సియేమాకు నేనే జన్మనిచ్చాను. కాని ఆమె నన్నే హతమార్చాలనుకుంది"

"మీరేమీ అనుకోనంటే నేను కూడా ఓ ఉచిత సలహా పారెయ్యాలనుకుంటున్నాను. మీరు సియేమాను బ్రేకులు లేని కారు మాదిరిగా తయారు చేశారని నా కనిపిస్తోంది. కారును నడుపుతున్నప్పుడు అవసరమైన చోట బ్రేకులు ఉపయోగించకపోతే ప్రమాదం జరుగుతుంది కదా" అన్నాను.

అతను కాస్సేపు మౌనం వహించి తర్వాత ఆనందంగా అన్నాడు "మీ సలహా సరైనదే. మీరే కాదు, పేవ్‌లోవ్ కూడా ఇదే మాట చెప్పాడు. మనిషి నాడీ తంత్రుల్లోని ప్రక్రియల్లో ముఖ్యంగా రెండు అంశాలుంటాయి. ఒకటి ఎక్సైటేషన్ (వుద్రేకం) రెండవది ఇన్హిబిషన్ (నిగ్రహం) మనిషిలో ఇన్హిబిషన్ కొరవడితే అతను క్రిమినల్ (నేరస్థుడు)గా మారిపోతాడు. సియేమాలో కూడా అదే జరిగింది. ఆమెలో వుద్రేకం వుండేది గాని నిగ్రహం వుండలేదు".

అలా అన్న తర్వాత అతను నా రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని వుత్సాహంగా వూపేస్తూ, "ఈసారి నేను కొత్త రకం సియేమాను తయారు చేస్తాను. అందులో నియంత్రణ శక్తి వుంటుంది" అన్నాడు.

* * *

మరుసటి రోజు ఉదయం నేను నిద్రలేచి చూస్తే అతను నా క్యాబిన్‌లో కనబడలేదు. కండక్టర్‌ని పిలిచి అతని గురించి వాకబు చేశాను.

కండక్టర్ నిట్టూరుస్తూ అన్నాడు "అతనో పిచ్చివాడు - స్టేషన్‌లో బండి ఆగగానే అతను వురుకుల పరుగుల మీద వ్యతిరేక దిశలో వెళుతున్న ట్రైన్‌లోకి ఎక్కేశాడు. అప్పుడతను పిచ్చిగా కేకలేశాడు. "నేను ఎక్కడో ఓ చోట బ్రేకులు వెయ్యక తప్పదు. అందుకే నేను తిరిగి వాపసు వెళ్ళిపోతున్నాను' అంటూ అతను అర్థం పర్థం లేకుండా అరుస్తూ వెళ్ళిపోయాడు" ●

